

కొండదేవునికోసం జాజియా బయలు దేరింది. జాజియా ఒక కోయపిల్ల. ఇరవై సంవత్సరాల వయస్సు. పెళ్లికాలేదు. అడవిలో చాలా దూరం వచ్చింది. ఒక కొండ మిట్టమీద నుంచి కళ్లకు చేయి అడ్డం పెట్టుకొని ముందుకు చూచింది. ముందు ప్రక్క క్రిందికి ఏటవాలుగా పచ్చగా ఉంది. పడమటగా ఆకాశం నీలిచీకట్లను సంధ్యారుణ కాంతులతో మిశ్రం చేస్తూ ఉంది. ఆ నీల రక్తకాంతుల్లో మసక మసకగా కూతవేటు దూరాన ఒక పెద్ద మంచె కంటికానింది. అప్పటికే తాను వెళ్లాలి. ఇప్పటి దాకా నిర్భయంగా ముందుకు సాగిన కాలు ఇప్పుడు తడబడడం మొదలు పెట్టింది. మూపున అమ్ముల పొది ఉంది. చేతిలో విల్లుంది. మొలను బాకుంది. నవయువ్వనంలో శరీరబలం తాండవిస్తూ ఉంది. అయినా, తనకు బిక్కు బిక్కుమంది. కొండదేవుడు తన్ను ఇల్లు విడిచి రావద్దని ఎంతో చెప్పాడు. కాని అతడేమై పోతాడో నని ఆమె బెంగ. ఆ మంచెమీదనే అతడుంటాడు. ఇంకొంచెం సాహసిస్తే అతణ్ణే

కలుసుకోవచ్చు.

కొండదేవుడు ఆ మంచెమీద ఉండడం మొదలుపెట్టి ఇది నాలుగోరోజు రాత్రి. తాను పొంచిన పెద్దపులి ఇంకా రాలేదు. ఆ సాయంకాలంతో తనకున్న ఆహారం ఆఖరు. ఒక్క గుక్కెడు నీళ్లమాత్రం ఉన్నవి. మంచె దాదాపు తాటిచెట్టు ఎత్తున ఉన్నది. దానికి ఏటవాలుగా పైనుంచి క్రిందికి కర్రలతో మెట్లు కట్టారు. ఆ మెట్లమీదనుంచి పెద్దపులి సరాసరి మంచెమీదికి ఎక్కిరావచ్చు. అలా ఎక్కి వచ్చునప్పుడే దాన్ని చంపాలని కొండదేవుని ఊహ. అది తప్పక తన్ను చంపడానికి ఎక్కివచ్చి తీరుతుంది. అది నరమాంసానికి బాగా అలవాటుపడి ఉంది. ఆ కొండవీటి ప్రాంతాన ఎంతోమంది మనుష్యులను చంపింది. అందులో భారీ పులి. అలాంటిదాన్ని వందేళ్ల లోపున ఎవరూ చూడలేదట. కొండకు చుట్టుపట్టున ఉన్న పల్లెలన్నీ తల్లడిల్లిపోయాయి. ప్రజలందరూ వెళ్లి ఆనాటి కొండవీటి పాలకుడైన కుమారగిరి రెడ్డికి మొరపెట్టుకొన్నారు. అతడు కరుణామయుడు. కళాప్రియుడు. ఆ పులిని చంపినవానికి వెయ్యి వరహాల బహుమానమని ఆజ్ఞాపత్రం వ్రాయించి ఊరూరా దండోరా వేయించాడు. కాని ఆ సాహస కార్యానికి ఎవరూ ముందుకు రాలేదు. తాను చెప్పినట్టు మంచె వేయిస్తే తానావనికి పూనుకొంటానని కొండదేవుడన్నాడు. చివర కతడు చెప్పినట్లే బ్రహ్మాండంగా మంచె వేయించారు. మంచె మీదికి కొండదేవుడు చేరాడు. అంతే. ఆ చుట్టు ప్రక్కల జనం ఇళ్లు విడిచి రావడంలేదు. అంతా నిర్మానుష్యం. చివరకు కొండవీటి రాజభవనంలో జరిగే రాజనర్తకి అయిన లకుమాదేవినాట్యానికి కూడా ఒక్క పురుగు హాజరు కావడంలేదు.

అంత నిర్మానుష్యంగా ఉన్న అరణ్యప్రాంతంలో జాజియా ముందుకు నడక సాగించింది. ఆ భారీ పులి ఏ పొదచాటునుంచి తనమీదికి నిరుముకు పడుతుందో? దాన్నిఇంకా కొండదేవుడు చంపలేదు. చంపితే ఇంటికి వచ్చేవాడే. తనకు చెప్పినట్టు వంద వరహాల బహుమానంతో తన్ను ఈపాటికి సొంత సొత్తు చేసుకునేవాడే. ఆ బహుమానం కోసం వెళ్లవద్దని ఎంతో చెప్పింది. తన్ను రావద్దని ఎంతోచెప్పి అతడు వెళ్లాడు. అతన్నే పులి చంపిందేమో? అతని శవమైనా తనకు లభిస్తుందో, లేదో? ఈ ఆలోచనతో ఆమె చరచరా దిక్కులు చూచుకొంటూ ముందుకు దూసుకొని పోతూనే ఉంది. ఆ భారీ పులికి భయపడేమో మెత్తని ఆమె అడుగు చప్పుడులు తప్ప అరణ్యమంతా నిశ్శబ్దంగా ఉంది.

మసక మసక చీకట్లు వ్యాపించాయి. అప్పుడే సాగిన గాలికి పొదలూ, చెట్లూ మెల్లగా కంపిస్తూ ఉన్నాయి. కొండదేవుడు మంచెమీది చిన్ని పూరిగుడిసె ముందు నిల్చి నల్దిక్కులూ

**ఆవేశపూరితులకు విచక్షణాజ్ఞానం శూన్యం. మోహావేశం అంతటి ప్రమాదకరమైనది వేరొకటి లేదు. ఫలించే అవకాశం లేనప్పుడు ప్రేమ ద్వేషంగా రూపొందుతుంది. ఆ రెండూ ఒకటే అయినా పరిణామాలు వేరు.**

పరికిస్తూ ఉన్నాడు. ఎండకు గుడిసెలో ఒక్క నిమిషం ఉండడం తప్ప అన్నం తినేటప్పుడు, నీళ్లు త్రాగేటప్పుడు అనుక్షణం రాత్రనక పగలనక పులికోసం పరికిస్తూనే ఉన్నాడు. పాపం, కంటికి, కాలికీ కూడ అలసట వచ్చింది. నాల్గో రోజు రాత్రి వచ్చింది. పులి రాదేమోనని నిరాశ చేసుకొన్నాడు. పోనీ దిగితే పులి ఏమాటునుండైనా కొడుతుందేమో? ఏమయినా ఈరాత్రి జాగ్రత్తగా ఉండి, తెల్లవారి ఇంటికి వెళ్దామనుకొన్నాడు. అందుకని దీక్షగా తేరిపార చూస్తూ ఉన్నాడు. ఒకచేతితో పెద్ద ఈటె కాచుకొన్నాడు. ఇంకొక చేతితో పెద్దకత్తి కాచుకొన్నాడు. అందుబాటులో అమ్ములూ, విల్లూ, వడిసెల, రాళ్లూ పెట్టుకొన్నాడు. పులిజాడ ఏమీ కన్పించలేదు. కాని ఎక్కడో దూరాన కొద్ది అలికిడి విన్పించింది. జాజియా తనకోసం రాదుగదా? వట్టి పిరికిపిల్ల. అందులో తెగింపు మనిషి. వస్తుందేమో! అమ్మో, వస్తే ఇంకేముంది? అతని గుండెలు టకటక కొట్టుకొన్నాయి. శరీరం నీరసం వచ్చినట్టు తేలికైపోయింది. అంతలో అల్లంత దూరాన ఒక పొదలో ఒక మెత్తని కదలిక తన పాము చెవులకు సోకింది. ఇంతలో ఇల్లింత దూరాన ధగధగలాడి వైడూర్యమణులవంటి కాంతుల జంట ఒకటి కంటికాని మాయమైంది. అదే ఆ దొంగపులి. ఈ రోజుతో ఈ ప్రాంతపు జనుల బెంగపోవాలి. అమాంతం అతని శరీరం పొంగింది. కాని ఆ పులి అలికిడి మరలా తగలలేదు. ఎంతో దూరాన పరిశీలించి చూడగా మరలా రెండు కళ్లు మెరిశాయి. 'ఏమిటి ఇంతలోనే ఈ పులి అంత దూరం పోయిందా?' అతనికి అనుమానం హెచ్చింది. లేక ఇంకొక పులికూడా వచ్చిందేమోనని అతనికి అనిపించింది. ఒకటా? రెండా? చివరకు ఒకేదఫా రెండు ప్రదేశాల్లో రెండేసి కళ్లు మెరిశాయి. దానితో రెండని అతడు నిశ్చయించుకొన్నాడు. 'ఇలాంటి సమయంలో జాజియా రాదుగదా' అని అనుకొంటూ ఒక ప్రక్క బెంగతో ఒకప్రక్క ధైర్యంతో ఆ రెండు పులుల్నీ కాచుకోడానికి తయారవుతున్నాడు.

ఇంతలో జాజియా మంచెకు ఒక ఫర్లాంగు దూరంలోకి వచ్చింది. ఆమెకు కుడిచేతి ప్రక్కగా ఒక అర ఫర్లాంగుమేరలో రెండు కళ్లు తళుక్కున మెరిశాయి. ముందుభాగాన మంచెకు దగ్గరగా ధగధగలాడుతూ రెండు పెద్ద కళ్లు మెరిసి వలయం తిరిగి అదృశ్యమయ్యాయి. వెంటనే ఆమె మొలకత్తి తీసి చేతధరించి నిలబడ్డది. ముందుప్రక్క కళ్లు మెరుస్తూ మెరుస్తూ మంచెమీదికి చూస్తూ ఉన్నట్టు కన్పించింది. తన కొండదేవుడు ఏమవుతాడోనని గుండె దడదడలాడడం మొదలుపెట్టింది. ఇంతలో కుడిచేతి ప్రక్కనుంచి గాండ్రుమని విన్పించింది. ఆ బొబ్బకు ఎవరో తన ప్రక్కకు చరచరా పరుగెత్తుకొని వస్తూ ఉన్నట్లు కన్పించింది. ఆ వ్యక్తి తనకు బార దూరంలోనికి రానేవచ్చాడు. అతని వెంట ఒక పులి గాండ్రుమంటూ వచ్చి పంజా ఎత్తి నోరునిప్పి వెనక కాళ్లమీద నిలబడ్డది. దాన్ని చూచి, "హా" అని పెద్ద కేకపెట్టి జాజియా దానిపైకి దుమికి తన పెద్ద కత్తి దాని నోటిలో బలంగా గుచ్చింది. అదే సమయంలో మంచెకు ముందున్న పులి వాసన చూచుకొంటూ కోరలు నిప్పి ఘుర్ఘురిస్తూ ఒక్కొక మెట్టూ నెమ్మదిగా ఎగ్రాకుతూ ఉంది. దాన్ని అన్నివిధాలా కాచుకొని మెల్లగా ఒక్కొక మెట్టూ దిగుతూ ఉన్న కొండదేవుని చెవులకు "హా" అనే శబ్దం అకస్మాత్తుగా సోకింది. అది జాజియా కంఠధ్వని. అతనికి బాగా తెలుసు. ఒకసారి అతని నరాల్లోనికి నీరసం ప్రవేశించింది. పులి అతన్నే సమీపించింది. అతని చేతిలోని ఈటెగాని, కత్తిగాని దానిపై ఏమీ పని చేయలేకపోయాయి. అది పంజా ఎత్తి కొండదేవుణ్ణి ఒక్క చరుపు చరిచింది. అతడు ముందుకు మ్రొగ్గాడు. పులి అతని మెడ నోటకరిచి నములడం, ఇంతలో వెనుక తట్టునుంచి చరచరా జాజియా వచ్చి తన పెద్ద కత్తితో దాని కుత్తుక తెగవేయడం రెండూ ఒక్క నిమిషంలో జరిగాయి. పులి కళేబరం, కొండదేవుని కళేబరం రెండూ జరజరా క్రిందికి దొర్లాయి. జాజియా మహా ఆత్రుతతో క్రిందికి వచ్చింది. అంతలో ఆమె రక్షించిన క్రొత్త వ్యక్తికూడా అక్కడికి వచ్చాడు. ఆ వ్యక్తి ఎవరో? తనకు కొండదేవుడు లేడు.

జాజియా దుఃఖానికి అంతులేదు. రాజబహుమానం ఆమె దుఃఖాన్ని మరీ అధికం చేసింది. ఆమె రోదనానికి శిలలు ద్రవించాయి. చుట్టపక్కాలు ఎంతో అనునయించారు. రోజు రోజూ రోజులు గడుస్తూ ఉన్నాయి. కాని ఆమె దుఃఖం నిత్యనూతనంగా ఉండడం మాన

## ఎ. లక్ష్మయ్యనాయుడు

లేదు. తాను రక్షించిన నూతన వ్యక్తి తన వెంటనే ఇంటికి వచ్చాడు. అతడు పలకడు, ఉలకడు. ఆమె తినమంటే ఏమైనా తింటాడు. కూర్చోమంటే కూర్చుంటాడు. పరుండమంటే పరుంటాడు. లేవమంటే లేస్తాడు. అంతే. అంతా ఆమె సైగ చెయ్యాలి. తనవంకే ఏదోరకంగా చూస్తూ ఉంటాడు. తన్ను చూచేటప్పుడు అప్పుడప్పుడు అతని బుగ్గలమీద కానరాని నవ్వు మొలకలు పుట్టి అంతట్లో మాడిపోతాయి. తానూ అతని ముఖంలోనికీ, ఆకాశంలోనికీ అదొక రీతిగా అప్పుడప్పుడు చూచేది. ఆ చూచే సమయంలో ఆమె మనస్సుకు ఒక తియ్యని ఊరట మెరుపు మెరిసినట్లు ఒక్క క్షణం కలిగేది. అది రాను రాను కొన్ని క్షణాలవరకు నిలబడుతూ వచ్చింది. ఆమె పూర్వంవలె పక్షులను కొట్టడం మానివేసింది. జింకలను వేటాడ్డం మానివేసింది. ఏ జీవజంతువు జోలికీ ఆమె ఇప్పుడు పోదు. ఆ నూతన వ్యక్తితోటే కలిసి తానున్న కొండ లోయలో తిరిగేది. రకరకాల తియ్యని పళ్లు తాను తిని అతనికిచ్చేది. తినేలాగు సైగచేసేది. పుట్టతేనెను పట్టి తాను త్రాగి అతనిచేత త్రాగించేది. సెలయేళ్లల్లో దిగి స్నానం చేయించేది. వెదురుబియ్యం, ఇప్పపువ్వు మొదలగు పదార్థాలతో కమ్మ కమ్మని వంటకాలూ, తియ్య తియ్యని రసాయనాలూ తయారుచేసి అతణ్ణి ఆనందపెట్టేది. ఇదంతా అచ్చటి తన జాతి కోయలకు వెగటుగా కన్పట్టలేదు. ఆ రీతిగానైనా ఆమె బ్రతికి ఉన్నందుకు వారు సంబరం చేసుకొన్నారు.

జాజియాది మంచి కోయరాజ కుటుంబం. తల్లి చిన్నప్పుడే చనిపోయింది. తండ్రి కొండదొర మొన్న మొన్ననే పులివేటలో మరణించాడు. అన్న గండాభిల్లు అంతకొక ఏడాది క్రితమే పులిగొట్టిన దొంగదెబ్బకు ప్రాణాలు విడిచాడు. తాను ఎంతో ఆశపెట్టుకొన్న కొండదేవుడు కూడా చివరకు అలా అయిపోయాడు. అందుకని ఆమె అంటే అందరికీ జాలి. చివరకు ఆమె ఒక ఇంటిదైతే చాలని వారి ఆశ. ఆమె ఎలాంటివాణ్ణీ తన దరికి చేరనియ్యదు. తనతో జట్టు కట్టనియ్యదు. కాని దిక్కులేనివాడనో, అమాయకుడనో, పిచ్చివాడనో ఆ నూతన వ్యక్తితో ఆమె జట్టుకట్టి తిరుగుతూ ఉంది. తిరిగి తిరిగి వచ్చి అతని ముఖంలోనికి ఎగాదిగా చూచి ఎందుకో అతనికి కాళ్లు పట్టేది. శరీరం మర్దించేది. తలమీద రకరకాల పసరులుపోసి మర్దనా చేసేది. ఆమె ఏమి చేస్తున్నా అతడు వద్దనేవాడు కాడు. ఆమె కళ్లల్లోనికి చూస్తూ ఉండేవాడు. చాలా సర్దా, కులాసా కనపరుస్తూ ఉండేవాడు.

ఇలా ఒక సంవత్సరం గిర్రున తిరిగి వచ్చింది. అతనిలో ఎంతో మార్పు వచ్చింది. మాట స్పష్టంగా వచ్చేది. అన్ని విషయాలూ ఆమెతో

## కొండ నీరైపోయింది

ధారాళంగా మాటలాడేవాడు. అతనికి పూర్వం ఉన్న అంగసౌష్ఠవం స్పష్టంగా బయలుపడ్డది. అతనివంక చూస్తూ ఆమె గంటలతరబడి రోజులతరబడి మైమరిచిపోతూ ఉండేది.

"జాజియా! ఎందుకలా నావంక నిత్యం కన్నార్పక చూస్తూ ఉంటావు? చెప్పవూ?" అని అతడు నవ్వేవాడు.

"ఏమీ లేదు, స్వామీ! ఊరికే" అని ఆమె ఇంకా అతని వంకే చూచేది. కాని కొండదేవుని ఆకారం అచ్చూ ముచ్చూ ఇతనిలో అచ్చు గ్రుద్దినట్లున్నదన్న సంగతి ఆమె ఎరుకపరిచేది కాదు. అలా చూచీ చూచి, "నావంక మీరు చూచినదానికి చూచాను. బాకీ చెల్లిందిగా స్వామి!" అని విరగబడి నవ్వేది.

అతణ్ణి ఎప్పుడూ "స్వామి" అనే మన్నించేది. కొండదేవుని స్వభావంతోపాటు అతని ఆకారమంతా ఇతనిలో ఆమెకు కన్పించేది. ఆ విశాలనేత్రాలూ, కోటేరు తీర్చినట్లున్న ఆ నాసిక— ఆ గంభీర ముఖం అచ్చూ అతనికదే. పైపెచ్చు మెలికలు తిరిగి కండలుదేరిన ఆ దండలూ, ఎత్తుగా విశాలంగా కన్పించే ఆ పిట్టరొమ్మూ, ఆ చేతుల పొడవూ, ఒడ్డు పొడుగూ సరిపడే ఆ పెద్ద విగ్రహంతీరూ, ఆ నడక పొందికా అంతా అతనిదే. ఇంతకూ ఆ నూనూగు మీసాలలో దాగుకొని బుగ్గల సొట్టలమీద తేలియాడే ఆ ముసిముసి నవ్వు మొలకలూ అతనివే. అచ్చంగా అతడే ఈతడని అనాలి. కాని, అతడు అరణ్యవాసి. ఇతడు నగరనివాసి. అతనిది కొండసిగ. ఇతనిది కాకపక్షాల ముడి. అతనిది గట్టిమాట. ఇతనిది నిండుమాట. అతనిది పరులయెడ శత్రుస్వభావం. ఇతనిది



'అమ్మయ్యా నెవరమ్మ కొట్టేనవారు?'

చిత్రం—కదార్ల లక్ష్మీకాంతరావు (కరీంనగర్)

ఇతరులయెడ మిత్రస్వభావం. అతని వర్తన కొన్నిజీవులు కాదనగలవు. ఇతనివర్తన అన్ని జీవులూ కాదనలేవు. ఇవే అతనికీ, ఇతనికీ గల భేదసాదృశ్యాలు.

అవి జాజియా దృష్టికి కన్పించనేలేదు. కాని ఒక్క పెద్ద భేదం మాత్రం వారిద్దరిలో ఆమెకు స్పష్టంగా కన్పించింది. అతడు నిత్యం పులివేట అంటే ఇష్టపడతాడు. ఇతడు నిత్యం నాట్యం అంటే ఇష్టపడతాడు. అందుకని ఆమె ఇతని కోరికనూ ఎప్పుడూ కాదనేదికాదు. కొండలోయల్లో, సెలయేళ్ల ప్రక్కన, గు మామిళ్లకు దిగువ, గురివెంద పందిళ్లక్రింద, మేఘాలు ఉరిమేటప్పుడు, నెమళ్లు పురివిప్పి ఆడేటప్పుడు, పక్షులు కిలకిలలాడేటప్పుడు, తుమ్మెదలు గుంపులు గట్టి నింగిని పాడేటప్పుడు, చిరుగాలికి పుప్పొళ్లు తెరలు గట్టేటప్పుడు అతనితో జాజియా నృత్యం చేసేది. అభినయం చూపేది. గీతం పాడుతూ నృత్యాన్ని ప్రదర్శించేది. శివతాండవం కొంతసేపు, శకుంతలా ప్రేమలేఖాభినయం కొంతసేపు, కచదేవయానుల గీతనృత్యం కొంతసేపు వారికి ఆ సమయంలో అభిమాన వస్తువులుగా ఉండేవి. ఇలా రెండవ సంవత్సరంకూడా వారికి గబగబా గడిచిపోయింది.

అంతకాలమూ అతని పేరేమో ఆమె అడగలేదు. అతడు చెప్పలేదు. సంసార సుఖ కళ్మత్వం వారిమనస్సుల్లో ప్రవేశించలేదు. "స్వామీ!" అని ఆమె పిలిచేది. "జాజియా" అని అతడు పిలిచేవాడు.

కాని ఒకనాడు నిర్వికారంగా అతడు ఆమె వంక చూచి, "జాజియా, నిన్నొకరి చేతిలో పెట్టి ఆ ఆనందం అనుభవించాలని నాకు ఉంది" అని అకస్మాత్తుగా అన్నాడు.

"ఏమిటి? ఎవరి చేతుల్లో....." అని అంటూ ఆమె తన ముఖం అతని చేతుల్లో పెట్టి, "స్వామీ! నన్ను మీ చేతుల్లో పెట్టుకొన్నాను. ఇదొక్కటే మీమాట కాదనడం. నాకోరిక కాదనక ఆదరించరూ" అని ఆమె అతని దోసిలి నిండా కన్నీరు నింపింది.

"జాజియా! నాకు భార్యవు కావాలని నీకోరికా?"

"అవును, స్వామీ!" అతనికి నోట మాట రాలేదు. ఆమె ముఖంలోనికి చూస్తూ గుటకలు మ్రింగుతూ ఉన్నాడు.

"స్వామీ! నేనంటే మీకు ఇష్టంలేదా?" అని జాజియా జాలిగా చూచింది.

"ఆ భాగ్యం నాకు కలిగిస్తావా, జాజియా?" అనిమాత్రం అతడని ఒక పెద్ద నిట్టూర్పు పుచ్చాడు.

"ఈ సమస్తం తమదే, స్వామీ!" అని ఆమె అతని చేతుల్లో వ్రాలింది.

"నా బంగారు జాజీ!" అని అంటూ అతడామెను చేరదీసుకొని ఆమె ముఖంమీది ముంగురులను సవరించాడు.

"నేనంటే తమకు ఇంత ఇష్టమెందుకు, స్వామీ!" అని జాజియా గారాముగా అడిగింది. కాని దానికి కారణం చెబుతూ ఉన్నట్లు అతని కళ్లవెంట రెండు వేడి కన్నీటి చుక్కలు ఆమె ముఖంపై వ్రాలాయి.

"నేను కొండదేవుని ఆకారం మీలో చూచు కొంటున్నాను, స్వామీ! నన్ను వదిలిపెడతారా?" అని అంటూ ఆమె తన రెండు చేతులూ అతని మెడకు వలయం చుట్టింది.

అతనికి ఆమె ప్రేమ అర్థమైంది. మరి తానెందుకు ఆమెను ప్రేమిస్తున్నట్లు? నిజంగా తానామెను ప్రేమిస్తున్నాడు. దానికి పెద్ద కారణం అతనికి ఉంది. దాన్ని అతడామెకు చెప్పలేక పోతున్నాడు.

ఆనాటి కొండవీటికి పాలకుడు కుమారగిరి రెడ్డి. అతడు కళాప్రియుడు. వసంతరాయడనే తన బిరుదు సార్థకంగా వసంతోత్సవాలు ప్రతి యేటా జరిపించేవాడు. అవచి తిప్పయసెట్టి తెప్పించిపెట్టే ద్వీపాంతర సుగంధ వస్తు సామగ్రి ఆ ఉత్సవాలకొక ప్రత్యేకత ఏర్పరిచేది. వాటితోపాటు లలితకళలు అతనికెంతో ఇష్టం. అందులో నాట్యకళ అతనికి అభిమాన విద్య. అందుకనే "వసంతరాజీయం" అనే నాట్య శాస్త్రాన్ని భరత భోజాదుల నాట్యశాస్త్రాలను గాలించి నూత్నంగా నిర్మించాడు. కళా మనోజ్ఞంగా నర్తనశాలను నిర్మింపజేశాడు. లకుమ అనే రాజ నర్తకిని తన ఆస్థానంలో నిల్పుకొని ప్రియాసదృశంగా గౌరవించాడు. నాట్యప్రయోగాలకు కీర్తిధరుణ్ణి ఆచార్యుణ్ణిగా నియమించాడు. రాజ్యపాలనానికి తన బావమరిది కాటయ వేమా రెడ్డిని నియోగించుకొన్నాడు. కాటయ కాళిదాస నాటకత్రయానికి వసంత రాజీయ మనేపేరితో వ్యాఖ్యానం వ్రాసిన దిగ్గజంవంటి పండితుడు. నవనవార్థాలతో అభినయాలు సృష్టించేది కొమరగిరి. వాటికి ప్రయోగ సాధనాలు వెదికేది కీర్తిధరుడు. వాటిని ప్రయోగంలో చూపేది లకుమ. వాటి లోటుపాటులు గమనించేది కాటయ. ఇలా కళాభిరమ్యాలైన రూపకాలు ప్రతిపక్షం అతని నర్తనశాలలో రెండు మూడు ప్రయోగింపబడుతూ ఉండేవి. అనుపూర్విగా వచ్చే త్రిపురదాహం, అమృతమంథనం అనే వాటితోపాటు గంగావతరణం, భీమగదాయుద్ధం, కర్ణ జననం అనేవి ప్రయోగించేవారు. చుట్టు పట్టు పల్లెలనుంచి సంయుతం జనం తండోప తండాలుగా వాటిని చూడడానికి వచ్చేవారు. రాజ బంధువులు, రాజోద్యోగులు, వారి జనానా అంతా అచ్చటికి వచ్చేవారు. వారికి ప్రత్యేకపు ఏర్పాట్లు ఉండేవి. అందులో ధన్వంతరి భట్టాచార్యుడనే రాజవైద్యుడు అసాధారణ వ్యక్తి. అతడున్నూ, అతని భార్యయైన యజ్ఞమణిలో ప్రతిరూపక ప్రయోగానికీ నర్తనశాలం వలంకరించేవాడు.

యజ్ఞమణి అపూర్వ సౌందర్య కళకు మణి

# శుద్ధమధ్యాక్కరాలు

## ఆరుద్ర

గేయమే మొదట పుట్టింది
హాయిగా జాతి నవ్వింది
వేయిపేరుల లక్షణమ్ము
వెనుక వచ్చిన దుష్ఫికొమ్ము
తీయతీయని నాటుపాట
దేశీయ సంపదలమూట
హేయమైనది పండితులకు
ఇలసంస్కృతపు హెచ్చు
కొరకు.

* * *

అన్యదేశ్య పదాలుతీసి
అవతలకు గిరవాటువేసి
పుణ్యపురుషులు పలుకుపలుకు
పుంజీడు మంచికే కులుకు
స్తన్యమిచ్చిన సవతితల్లి
స్వంత తల్లికి అనుగుచెల్లి
ధన్యవాదము చెప్పవయ్య
తగువాడకోయ్ తస్సదియ్య.

* * *

విన్నన్న చెప్పింది వేదం
వీటోను చేయకపరాధం
నిస్సారమైనట్టి గతము
నీతి కుళ్లిన పాత మతము
లెస్స! ఛాందస వృద్ధశకము
లేసుజ్ఞానము వారిసుకము
ఇస్సి! ఈ స్పుట్నిక్కు
పథము
ఎద్దుబండే బ్రహ్మ రథము.

* * *

బడిలోన గుడిలోన పనిలో
భజన కూటపు పుణ్యవనిలో
తడు... కొనకుండ సజ్జనుడు
తంబాకు నమిలినా ఘనుడు
మడికట్టుకొన్న మునిముచ్చు
పొడుము పట్టును పీల్చవచ్చు
పడుచుకుర్రాడు సిగరెట్టు
పానమొనరించ ఎబ్బెట్టు.

"తొలినాడు తనపెళ్లి ముందు
అలవాటుగా పొందు ముందు
కులకాంత ఒకలైపు ఫేటు
వెలయాలు ఒకనైటు రేటు
నిలదీసి బేరమాడేరు
వెలది శీలములాయె వేరు"
వెలిబుచ్చె ఇటువంటిబాధ
విప్లవపు యెమ్మారు రాధా.

* * *

దేవుడచటే వెలసె ననుచు
తెలివితక్కువ ఊహగొనుచు
చావుకోసము వలసపోయి
సతమతంబవనేల భాయీ?
ఈ వసుంధర మేనుపైన
ఏవొక్క అంగుళంబైన
పావనమ్మే! పుణ్యవహము
వారణాసే స్వంత గృహము.

* * *

ఎండమావుల వేటచాలు
ఈనగాచిద నక్కపాలు
పండిపెట్టిన మార్క్సిజమ్ము
వడ్డించ కలిసింది దుమ్ము
తొండ ముదిరిన రంగమార్చు
తోడేలు శాంతి పరిమార్చు
ఇండియా ఎదతెలియలేదు
ఈనాటి ఎర్రకామ్రేడు.

* * *

నీవున్న సీమలో తొణకు
నీరు మాత్రము తీర్థమనకు
నావనీతపు జలమనంగా
నైలువోల్గా థేమ్సుగంగ
లావణ్య దేవామృతాలు
లహరులన్నియు దైవతాలు
జీవనాధారమౌ నదులు
శ్రీమన్మహా సౌఖ్యనిధులు *

# కొండ నీరైపోయింది


వంటిది. భర్తంటే ఆమెకు ఎంతో ప్రీతి. కలువపువ్వులు మంచి ఆమె విశాలనేత్రాలు చేసినట్లుండేవి. చంపకపుష్పం ఆమె నాసికగా ఏర్పడినట్లుండేది. ఇంచుక సొగదేలిన చంద్ర బింబం ఆమె ముఖంగా ఉన్నట్లనిపించేది. నవ్వు మొలకలు మల్లెమొగ్గల్లా ఆమె చెక్కిళ్లపై విచ్చుకొనేవి. బాహ్య సౌందర్యంతోపాటు ఆంతర సౌందర్యం, కళాతృష్ణ, ధర్మదృష్టి ఆమె కన్నుల్లో తళారించేవి. కాని ఒక్కొక్కప్పుడు ధర్మదృష్టిని మీరిన కళాతృష్ణ ఆమెలో తొణికిసలాడేది. అందులోనూ పాపత్వమే పత్యా న్వేషికి ప్రస్ఫుటమయ్యేది. కాని దానికి సహనం ధన్వంతరిభట్టులో లేదేమో అనిపిస్తుంది.

నాట్య ప్రయోగాలకు హాజరైనప్పుడు ఆమె దృష్టి కీర్తిధరుని ప్రయోగ నైపుణ్యం మీద నిశితంగా ప్రాలేది. అందులో ఆమెకొక రమణీయత్వం, అనిర్వచనీయత్వం ద్యోతక మయ్యేవి. కండలు తిరిగిన కీర్తిధరుని శరీర సౌకుమార్యంలో అవి ఆమెకు తళారించేవి. ఆ తళారింపులో అతని మూర్తి గాంభీర్యం, ఔచితీపాటవం నిగారించేవి. భరతముని నాట్య పవిత్రతాప్రియులు అతని కదలికలలో కన్పించేవి. అది ఆమె కళాతృష్ణకు చిహ్నమే అవాలి. కాని అతనితో మాటలాడాలని ఉబ లాట పడేది. అతని సాన్నిధ్య పరిచయం కావా లని కోరుకొనేది. ఆ తమిపెల్లిదం ఆమె దృష్టిలో ప్రతిఫలించేది. అయితే అందులో అపవిత్రభావం కన్పింపదు. అపశ్రుతి విన్పింపదు. కాని దాన్ని చూచి ధన్వంతరిభట్టు ఓర్చుకోలేక పోయాడు. అతని మనస్సునకు అదోకలా అన్పిం చింది. అతని ఊహాలు చిలవలుపలవలు కాసాగాయి. ఆమె ఇంచుక దారి తప్పితే ఇంకేముంది? తన గౌరవ శిఖరం కూలిపోతుంది. తన వంశ ప్రతిష్ఠ భ్రష్టమైపోతుంది. తన తల వీధి రచ్చనే తెగవేసినట్లవుతుంది. ఏమి చేయడం? అతడు ఆమె శరీర మోహన సౌందర్యానికి దాసుడు. అతడు ఆమె పతిభక్తి పరాయణత్వ భావ సౌకుమార్యానికి విక్రీతుడు. అతని ఆలో చనలు చంటిబిడ్డల్లాగు సందేహమనే ఊయ లలో ఊగుతూ ఉన్నాయి. దీనికితోడు ఒక నాడు ఒక దుర్ఘటన అతని కంటికి బాగా కన్పించింది.

"శకుంతలా సంజనన" రూపక ప్రయోగ సమయంలో లకుమ మేనక భూమిక ధరిం చింది. కీర్తిధరుడు విశ్వామిత్ర పాత్రధరుడై ఉన్నాడు. వారి ప్రణయంలో కుమారగిరి రెడ్డి ప్రవేశపెట్టిన విశ్రామరాగ శృంగార భావం అభినవార్థంతో అభినయింపబడుతూ ఉంది. అంతలో అత్యానందంవల్ల శతవృద్ధ రాజమాతకు అకస్మాత్తుగా ప్రమాదం ఏర్ప డింది. తక్షణం ధన్వంతరిభట్టు రాజాజ్ఞతో ఆమె వెంటకు వెళ్లవలసి వచ్చింది. పర్తనశాల యావత్తూ స్తంభించిపోయింది. కాని కీర్తి ధరుడూ, లకుమాదేవీ రాజమాత వెంటకు

అదొక తీర్థై పోతూ ఉన్నారు. కీర్తిధరుడు యజ్ఞమణి సమీపంగా వెళ్లే సమయంలో ఆమె చివాలున లేచి చేతులు జోడించి, "నాట్యాచార్యులకు నమోవాకములు" అంది. ఆ మాటకా సమయంలో ఏమనాలో కీర్తి ధరునికి తెలియులేదు. కాని, "నమోవాక ములు" అని ఆమె కళ్లల్లోనికి చూచాడు. ఆ దృశ్యం ధన్వంతరిభట్టుకు కంటబడ్డది. ఆనాటి రూపక ప్రయోగం అంతటితో సమాప్తమయింది. అయితే, ఆ విష విషమ దృశ్యప్రయోగంమాత్రం భట్టు కళ్లల్లో అనుక్షణం జరుగుతూనే ఉంది. దానికి విరుగు డతడు తన చిత్తాన్ని తర్జనభర్జన చేసుకొని కనిపెట్టుకొన్నాడు.

భట్టు కీర్తిధరునితో స్నేహపరిచయం బాగా సంపాదించుకొన్నాడు. ఒండొరుల గృహాలకు ఒండొరుల రాకపోకలు ధారాళంగా జరిగే అంతదాకా అది వచ్చింది. నోటిమాటే లేదుగాని కళ్లచూపు యజ్ఞమణీ కీర్తిధరులకు రోజా కొకమాటైనా ఉంటుంది. అయితే, ఎవరి కళ్లల్లోనూ మాలిన్యం కన్పింపదు. భావచాపల్యం పొడసూపదు. కళాతృష్ణ పేరుతో అది యజ్ఞమణిలో ఉంది. సౌందర్యపిపాస పేరుతో అది కీర్తిధరునిలో ఉంది. చివరకు యజ్ఞమణీ కీర్తిధరులు రోజా కొకసారియైన చూచుకొనకుండా ఉండలేకపోయేవారు. ఆ వాంఛలో కారణంగా ఉన్నది సోదరప్రేమో లేక దాంపత్యప్రేమో? అయినా, యజ్ఞమణి మగవాలి. ఎంత కళాతృష్ణ ఉన్నా ఇంత తగదు. భట్టు ప్రత్యణువులోని ప్రత్యంశం గమనింపక పోలేదు. ప్రతి గతిలోని ప్రగతి ఆకళించు కొనకపోలేదు. తన కపట నాటక క్రియాదక్ష



గృహాలంకరణ

చిత్రం — వేణు (నిజామాబాద్)

తకు నాంది, భరతవాక్యం రెండూ ఒకేసారి జరగాలనుకొన్నాడు. సమయం వచ్చింది. ఒక నాడు అస్వస్థుడై ఉన్న కీర్తిధరుని చూడ డానికి అతని యింటికి భట్టు వెళ్లవలసి వచ్చింది. వెళ్లి వైద్యమిషతో విషప్రయోగం సమధికంగా చేశాడు.

కీర్తిధరునికి ఆరోగ్యం చేకూరినట్లే వారం రోజులు కన్పించింది. కాని అంతలో భట్టు విషప్రయోగ మహిమ ఎట్టిదో కాని కొన్ని రోజుల్లో కీర్తిధరుడు జీవచ్ఛవంగా మార సాగాడు. కబురు పంపగా భట్టు తనకు రాజ కార్యాలమూలాన తీరిక లేదన్నాడు. పాపం కీర్తిధరుని తలమీద వెయ్యి బాహువు లొకే మారు ఒత్తినట్లుండేది. వెయ్యి సూదులు శరీరంలో ఒకేదఫా గ్రుచ్చినట్లుండేవి. తన్ను సలసల కాగే మాసె కళాయిలో దించినట్లుం డేది. కీర్తిధరునికి ఏవేవో ఊహాలు ప్రాకాయి. భట్టు తనకు అపకారం చెయ్యలేదు గదా? తన సౌందర్యపిపాసను అపార్థం చేసుకోలేదు గదా? అలాంటి పిపాసను ఎవరైనా అపార్థం చేసుకొంటారు. మరి తాళిగట్టిన భర్త చేసుకోకమానతాడా? తనకీ దురవస్థ భట్టు చేతి మహిమవల్ల కలిగిందే. దుష్కర్మకు ఫలం అనుభవింపక తప్పదు. అదిగాక యజ్ఞమణి తన్ను అపార్థం చేసుకొని భర్తచేత ఈ ప్రయోగం చేయించిందేమో? ఈ ఆలోచన లతో అతనికి మతికూడా నెమ్మదిగా నీరసింప సాగింది. ఈ అవస్థలో అతణ్ణి చూడడానికి యజ్ఞమణి పెక్కుసారులు కీర్తిధరుని ఇంటికి పేరంటం పేరుతోవచ్చి కన్నీరు మున్నీరుగా చూచి కళ్లు తుడుచుకొని పోయేది. ఆమె భావమేమో కీర్తిధరునికి అంతుపట్టలేదు. ఈ బ్రదుకు బ్రదకడంకంటె చావడం మంచి దని అతడు నిశ్చయించుకొన్నాడు. రామ రామ మాట తడబడి చివరకు అతనికి మాటకూడా లేకుండాపోయింది. దానికితోడు ఒకనాడు అతని యింట్లో అతడే లేకుండాపోయాడు. కొమరగిరిరెడ్డి అతణ్ణి ఎంతో వెదకించాడు. ఆఖరుకు అతడెక్కడనో ఎలానో మరణించి ఉంటాడని నిశ్చయించుకొన్నారు. నాటితో నర్తనశాల బావురుమంది.

ఆ కీర్తిధరుడే జాజియాపల్ల ప్రాణదానం పొందిన స్వామి. ఆ యజ్ఞమణి జగన్మోహన లావణ్యమే జాజియాలో అతనికి కన్పిస్తూ ఉన్నది. ఆ విషయం అతడు జాజియాకు చెప్పాలనుకొన్నాడు. కాని చెప్పలేకపోయాడు. అయినా అతడు ప్రయత్నించి, "జాజియా, నా పేరు నీకు తెలుసా?" అన్నాడు.

"స్వామి" అని అంది.

"కాదు, పిచ్చిదానా!"

"కాకుంటే మరేమిటి?" అంది.

"కీర్తిధరుడు" అన్నాడు.

(తరువాయి 55 వ పేజీలో)

# కొండ నీరైపోయింది

( 8 వ పేజీ తరువాయి)

ఆ పేరు వినేసరికి ఆమె ఉలిక్కిపడ్డది. "కొండవీటి ప్రభువువారి నాట్యశాలలో ఉండే కీర్తిధరులా మీరు? వట్టి అబద్ధం" అంది.

"నిజం, జాజియా!"

ఈ చివరి మాటకు ఆమెకు ఏడ్పు వచ్చింది. కీర్తిధరుని పేరు తనకే కాదు తన కోయజాతి వారందరికీ తెలుసు. అతడు చాల గొప్పవాడు. అతని నాట్యప్రయోగాలకు అప్పుడప్పుడు తాము వెళ్లడం కద్దు. తన దాంపత్యం అలాంటివానితోనా? చివరిదాకా నిలిచేదేనా? ఏమేమో ఆలోచనలు ఆమెకు తట్టాయి. ఆమె మనస్సు అయోమయం అయింది.

వెంటనే తన ముఖం అతని చేతుల్లో పెట్టి అతని రెండు కాళ్లూ పట్టుకొని, "కొండ దేవుణ్ణే ప్రేమించి మైలపడ్డదాన్ని, స్వామీ! మీ అంతస్తుకు తగను. అయినా నన్ను వదిలి పెట్టబోకండి, స్వామీ!" అని అదొకరీతిగా బెదురుతూ అంది.

"జాజీ! ఈ కీర్తిధరుడు ఆ కీర్తిధరుడు కాడు. నీవు పులినోటినుంచి ప్రాణదానంచేసి తెచ్చుకొన్న కీర్తిధరుడితడు. కాదు. నీ స్వామి. నీ కొండదేవుడు" అని కీర్తిధరుడామెను లాలించి చేరదీసుకొన్నాడు. ఈ అరణ్య లతావృక్షాలు సాక్షిగా నిన్ను వదలనని ప్రమాణం చేశాడు. తిరిగి బ్రతికిన ఆమె కొండదేవుడే తానని ఆమెను విశ్వసింపజేశాడు. దానితో ఆమె హృదయం కొంత శాంతించింది. మనసార వంగి అతని పాదాలొకమారు ముద్దుపెట్టుకొంది. అతనికి కీర్తిధరుడనే పేరు వద్దనీ, తన స్వామిపేరే ఉండాలని ఆప్యాయంగా కోరింది. "నీ ఇష్టం, జాజీ!" అని అతడన్నాడు. దానితో ఆమెమీదికి అమృతం ప్రవహించినట్లయింది.

అంతా మరిచిపోయి యధారీతిగా విచిత్ర నాట్యప్రయోగాలతో వారిద్దరు ఆనందించడం మొదలుపెట్టారు. అచ్చటి కోయజాతివారికి తమ నాట్యాలతో విందుకూర్చడం ప్రారంభించారు. నెమ్మది నెమ్మదిగా కీర్తిధరుని అఖండ నాట్యకళానైపుణ్యం కొండవీటి రాజధానికి కూడా ప్రాకింది. వారి వీరివలన అతడు తమ నాట్యాచార్యుడైన కీర్తిధరుడేనని కొమరగిరిరెడ్డి దృఢంగా విన్నాడు. అతడు బ్రతికి ఉన్నందుకు పరమానందభరితుడయ్యాడు. అతనిని సగౌరవంగా రాజధానికి కొనిరావడానికి వెంటనే తగిన సిబ్బందిని పంపించాడు. రాజ సిబ్బంది కీర్తిధరుని దర్శించి రాజ హుకుమును సాదరంగా విన్నవించుకొంది.

కీర్తిధరుడు కొండవీటికి ప్రయాణం కట్టక తప్పింది కాదు. ఇది కోయజాతివారిలో పెద్ద అలజడి కలిగించింది. కీర్తిధరునికి కూడ తాను రాజధానికి వెళ్లాలని, తాను దిద్ది తీర్చిన జాజియా భరతనాట్యాన్ని కొండవీటి నర్తనశాలలో లకుమాదేవితోపాటు దీటుగా ప్రదర్శింపచేయాలనీ కోరికలు ఉవ్విళ్లూరాయి. జాజియాకు ఆ విషయం నెమ్మదిగా చెప్పి ఒప్పించాడు. కాని ఆమెకు అదేమో పెద్ద మరణభయంగా అనిపించింది. తనకు వెళ్లాలని లేదు. కీర్తిధరుని మరి విడిచి ఉండాలని లేదు. ఏమైనా తన స్వామితోటిదే తన జీవితం. తన వారికందరికీ తన ప్రయాణం సంగతి చెప్పింది. ఆ చెప్పడంలో తనకు ఉత్సాహం లేదు. కుల పెద్దలు చివరకు జాజియా కీర్తిధరులను సాగనంపుతూ, "బాబయ్యా! దిక్కులేని పిల్ల. నిన్ను నమ్ముకొంది. అవోగతిపాలు చేయబోకండీ" అని కన్నీటి పర్యంతమై అరణ్య వస్తువులు బహుమానమిచ్చి సాగనంపారు.

పాపం ఆమె ప్రయాణాన్ని లతలూ, చెట్లూ చిరుగాలికి ఊగిసలాడి అడ్డుకొన్నాయి. మృగాలన్నీ అదొకరీతిగా మొరలెత్తి బారులు తీరి ఆమెకు అడ్డంగా నడిచాయి. పక్షులన్నీ కిలకిల లాడాయి గాని అందులో రోదన ధ్వనే వినిపించింది. ఆ అరణ్యమంతా ఒక సుడిగాలికి సుడిసి, ఆమెను వెళ్లవద్దని చెబుతూ ఉన్నట్లు ఆమె కనిపించింది. ఆమె మనస్సు చేయిపెట్టి కలచినట్లు ఉంది.

ఆమె తన కడ్డంవచ్చే లేళ్లను దువ్వి, 'మీకంటే గొప్ప సౌకుమార్యం నా స్వామిలో ఉంది. మరి వెళ్లివస్తాను" అని వాటిని ముద్దాడి నెమ్మదిగా తొలగదోసింది.

తలకు తగిలే లతాఫలాలను సవరించి, "మీలోకంటె గొప్ప తియ్యదనం నా స్వామిలో ఉంది. మీరిక్కడే ఉండండి. వస్తా" అని వాటిని నిమిరి ముందుకు సాగింది.


అడ్డుపడిన సెలయేళ్లను జూచి, "మీ స్వచ్ఛతకంటె గొప్ప స్వచ్ఛత నా స్వామిలో ఉంది. నన్ను పోనివ్వండి" అని వాటిని నెమ్మదిగా దిగిదాటింది.

చీరకు తగిలిన పూలపొదల వంకకు తిరిగి "మీలోని మార్దవం, మాధుర్యం నా స్వామిలో ఉన్నవి. నన్ను పోనివ్వరూ?" అని వాటిని కళ్ల కద్దుకొని తప్పుకొన్నది.

అదంతా చూచి కీర్తిధరుడు, "మా నగరవాసులకు ఆ గుణాలు లేవని అవి అనుకొన్నవి కాబోలు" అని నవ్వాడు.

"కాదండీ.ఆ గుణాలు నా స్వామికి ఉన్నవని చెప్పుకొంటున్నాను" అని అంటూ ముసి ముసి నవ్వుతో అతి కష్టంమీద ఆ అరణ్యాన్ని దాటి ఆమె కీర్తిధరునితో కొండవీటి రాజధానికి చేరింది.

కొండవీటి నర్తనశాల తిరిగీ కళకళ లాడింది. కొమరగిరి దగ్గరనుంచి ఆబాల గోపాలం ఆనందించారు. లకుమాదేవి తన



కావలి

చిత్రం—అనుముల శ్రీహరి (హైదరాబాద్-౩)

జీవితం పూచి ఫలించినట్లు ఎంచుకొంది. యజ్ఞమణికి ఒక చెప్పరాని ఆనందం కలిగింది. భట్టు లోలోన తీవ్రంగా మధనపడ్డాడు. మరలా కొండవీటి నాట్యప్రయోగ కీర్తి దశ దిశలా ప్రాకింది. ఈమారు లకుమాదేవి నాట్యంతోపాటు జాజియా నాట్యం రంగస్థలంపై ప్రత్యక్షమై, ప్రేక్షకుల మెప్పులందడం ఒక విశేషంగా పరిణమించింది. కొమరగిరి బ్రహ్మానందభరితుడయ్యాడు. కాని ఈ జాజియా ఎవరు? అన్న సమస్య యజ్ఞమణి కళాతృష్ణకు తగలకపోలేదు. ఆమె ఆరాపై ఆరా తీయించింది. జాజియా కొండ జాతి పిల్ల అని ఆమె రూఢిగా కొండజాతివారి వల్ల తెలిసికొంది. ఆమె మనస్సు అదొకలా అనిపించింది. కీర్తిధరునికి ఈ మచ్చ ఏమిటి? అతడు పూర్వంకంటె కళాప్రయోగ నైపుణ్యంలో అపూర్వ కీర్తిని గడిస్తున్నాడు. అతని కీర్తిని మచ్చదీసిన చందమామను జేయాలి. ఈ అభినివేశం ఆమె కళాతృష్ణను పెనగొన్నది. మరి అది ధర్మతృష్ణ ఏమో? లేక ధర్మతృష్ణ పేరుతోనున్న మరొకటో? ఆమె హృదయం తెలియరాకున్నది. ఆమెకు అహోరాత్రం నిద్రలేదు. పేరంటం పేరిట కీర్తిధరుని చుట్టపక్కాలందరితో సంప్రదించింది. అతని నుండి వారిని వేరు చేసింది. చివరికీ వార్త తన భర్త అయిన భట్టు ద్వారా కొమరగిరి పర్యంతం ప్రాకించింది. ఒకనాడు లకుమాదేవితో వాదించింది. "జాజియా మంచిపిల్ల. అయినా కీర్తిధరులవారితో సంప్రదించండి" అని లకుమ తూష్ణీంభావం వహించింది. యజ్ఞమణి అంతటితో ఊరుకోలేదు. ఎందరో పురానా మనుషులతో జాజియాను వదిలివేయవలసిందని కీర్తిధరునికి చెప్పించింది. తన వంటి ఆదర్శప్రాయుడు, లోకోత్తర కళావేత్త ఉంపుడుకత్తెతో ఉండడం భావ్యం

కాదని రహస్యంగా కబుర్లు చేసింది. అన్నింటినీ కీర్తిధరుడు గడ్డిపోచలా ఎగురగొట్టాడు. జాజియా లేనినాడు తాను లేనట్లేనని స్పష్టం చేశాడు. తుపానుకు మహాపర్వతంవలె అతడు తొణకా లేదు, బెణకా లేదు. ఇక యజ్ఞమణే స్వయంగా కీర్తిధరుని కలుసుకోవాలనుకొంది. ఇంతకుపూర్వమెప్పుడూ అతనితో భాషించి ఎరుగదు. అయినా తన మాట కాదనడని ఆమె పూర్ణ విశ్వాసం. అంతటి ఆత్మవిశ్వాసం ఆమెకు ఎందుకు ఉన్నదో!

ఒకనాడు కీర్తిధరుడు నర్తనశాల ఆవరణంలో రసాలం క్రింద పట్టుసోఫాపై ఒంటరిగాకూర్చుండి వసంతరాజీయ నాట్యశాస్త్ర విశేషాలు తిలకిస్తూ ఉన్నాడు. అక్కడికి అకస్మాత్తుగా యజ్ఞమణి వచ్చింది.

ఎవరో వస్తున్నట్లు గమనించి కన్నెత్తిచూచి, 'రా రా, జాజియా! సమయానికి వచ్చావు" అన్నాడు కీర్తిధరుడు.

"నమస్కారమండి. నేను జాజియాను కాదు" అంటూ యజ్ఞమణి ముందుకు వచ్చింది.

"ఓహో! మీరా? ఈమధ్య జాజియాకూడా మన ఆడవారి దుస్తుల వేషమే అవలంబించడం చేత పొరపడ్డాను. క్షమించండి. అలా దయ చేయండి" అంటూ ఎదుటి సోఫా చూపాడు.

"మన ఆడవారి దుస్తుల వేషం అవలంబించడమే కాదు; మా ఆడవారి మర్యాదను కూడా హరించడానికే ఆమె తమవెంట దయచేసింది" అని అంటూ యజ్ఞమణి కూర్చోలేదు.

"వట్టి అమాయకురాలు. ఆమెకు అదంతా ఏమీ తెలియదు" అని ఒక్క నిట్టూర్పు విడిచాడు కీర్తిధరుడు.

"తెలియకపోవడంచేతనే కాబోలు కొండదేవునితో తైతక్కలాడి తమను చేపట్టింది?"

"అందులో ఆమె దోషంలేదు."

"అయితే ఇదంతా తమ దోషమే."

"అవునండీ."

"అలా అయితే మీవంటివారు దోషభూయిష్ఠులుగా ఉండడానికి వీలులేదు."

"ఇందులో దోషభూయిష్ఠత్వం ఏమున్నదండీ?"

"ఒకసారి ఒకరిని మరిగిన వ్యక్తి మరొకరిని చేపట్టితే వ్యభిచారిణి అనిపించుకొంటుంది. అట్టి వ్యభిచారిణి చేసే పనులు మేము సహించలేము."

"ఆమె వ్యభిచారిణి కాదు, యజ్ఞమణీ!"

"రుజువులున్నవి."

ఇక కీర్తిధరుడు మాటాడలేకపోయాడు. ఆలోచించి ఆలోచించి, "అవి ప్రత్యక్ష నిదర్శనములైతే త్యజిస్తాను" అని అతడు పైకిచూస్తూ అన్నాడు.

"ఈరాత్రే తొలిచుక్క పొడిచేవేళకు మాట తప్పరుగదా" అని యజ్ఞమణి రెట్టించింది.

కీర్తిధరుడు నిలువుగ్రుడ్లతో ఆమెవంకచూచి,

# కొండ నీరైపోయింది

"అలానే" అని నీరసంగా అన్నాడు. తక్షణం అక్కడినుంచి యజ్ఞమణి కదలిపోయింది.

యజ్ఞమణి ముందుగానే వ్యూహం పన్ని ఉంది. జాజియా కొండజాతి కోయపిల్ల. అంటే తక్కువ జాతిది. వ్యభిచారం వారికి సహజం. అందుచే ఎవరైనా వెళ్లి కొంచెం పరిచయం చేసుకొన్న వెంటనే ఆమె చెడిపోయి తీరుతుంది. ఈ యథార్థం కీర్తిధరునికి ప్రత్యక్షంగా చూపించాలి. ఈ ఆలోచనతో ఆమె తన నమ్మిన నౌకరైన చెంచలనాగు అనేవాణ్ణి జాజియాపై ప్రయోగించడానికి సిద్ధం చేసింది. వెంటనే ఆమె ఈ రాత్రికి జారుబండ శిఖరంమీద కీర్తిధరుడు ఉండాలని అతనికి కబురుచేసింది. అది కబురుగాదు. ఆజ్ఞ.

జారుబండ శిఖరం కొండవీటి కొండమీద రాజభవనాలకు దగ్గరగానున్న పెద్ద ఎత్తైన శిఖరం. అది ముందుకు వంగి ఉంటుంది. ఆ వంపులో క్రిందతట్టున కీర్తిధరుని మందిరం ఉంది. అందులో కీర్తిధరుడూ, జాజియా మాత్రమే ఉంటారు. నౌకర్లు రాత్రిపూట ఉండరు. ఆ శిఖరంమీదివారికి కీర్తిధరుని మందిర ప్రాంగణమంతా స్పష్టంగా కన్పిస్తుంది. శిఖరానికి, మందిరానికి దగ్గర త్రోవలేదు. వంపులు వంపులుగా మెలిదిరిగి పైకి వెళ్లాలి. అది రమారమి రెండు ఫర్లాంగులుంటుంది. శిఖరంమీదినుంచి క్రిందికి ఒక అరఫర్లాంగు మాత్రమే ఉన్నది. కాని అక్కడినుంచి దూకవలసిందే తప్ప మరి మార్గమేమీ లేదు. అట్టి శిఖరంమీదనే కీర్తిధరుడుండవలెనని యజ్ఞమణి ఆజ్ఞచేసింది. ఆ ఆజ్ఞ కీర్తిధరునికి జాజియా రూపంలోనుంచి వచ్చినట్లనిపించింది. అతడు జీవచ్ఛవంవలె ఆ శిఖరంమీదికి వెళ్లి కూర్చు



సమర్పణ

చిత్రం—హోతివి అప్పారావు (రాజమండ్రి)

న్నాడు. తన ఇంటి ప్రాంగణంలో కొవ్వువత్తితో వెలిగే గోళాకారంగానున్న పెద్ద గాజుకుప్పె దీపకాంతి కన్పిస్తూ ఉంది. మందిరంలోపలి శయ్య పర్చి తనకోసం కాబోలు అచ్చటే సోఫాపై కాచుకొని కూర్చున్న జాజియా తనకు స్పష్టంగా కన్పిస్తూ ఉంది. అతడామె వంకకే దిగులుతో చూస్తూ ఉన్నాడు.

అప్పుడే అష్టమిచంద్రుడు అస్తమించాడు. వెన్నెలలుపోయి చీకట్లు వ్యాపించాయి. గాఢాంధకారం అలముకొన్నది. చుక్కలు చరచరా చరమ దిశకు మొగ్గుతూ ఉన్నాయి. ఇంకా జాజియా ఆ సోఫామీదనే కూర్చొని ఉంది. ఆ చీకట్లో దీపపు వెలుగున బాగా కన్పిస్తూ ఉంది. ఆమె వంకకే కీర్తిధరుడు తదేకదీక్షతో చూస్తూ ఉన్నాడు. తొలిచుక్క నింగిని పొటుక్కున పొడిచింది. జాజియా ఉలిక్కిపడి లేచింది. ఎవరో ఒక నూతనవ్యక్తి ఆమెను సమీపిస్తూ ఉన్నాడు.

ఆమె వెనుకకు వెనుకకు తగ్గుతూ, "ఎవరు మీరు? ఎందుకు వచ్చారు?" అన్నట్లు చెయ్యి ఆడిస్తూ ఉంది.

కాని ఆమె సైగను లెక్కచెయ్యకుండా ఆ నూతనవ్యక్తి ఇంకా ఆమెను సమీపిస్తూనే ఉన్నాడు. కీర్తిధరునికి అనుమానం వేసింది. అంత చొరవగా ఏమాత్రం పరిచయంలేని వ్యక్తి అంత ముందుకు వెళ్తాడా? అని, యజ్ఞమణి మాట నిజమేమోనని. ఎంతో ఆవేదనతో ఆవేశంతో చూస్తూ ఉన్నాడు.

వెనుకకు తగ్గిన జాజియా ముందుకువచ్చింది. అది చూచి, "ఎంత ఆత్మవంచన చేసుకొన్నాను" అని కీర్తిధరుడు ఒక్క నిట్టూర్పు విడిచాడు. దానివేడికి అతడున్న శిఖరం కాగినట్లయింది. ఇంతలో గద్దిస్తూ ఉన్నట్లు ఆమె చేయి ఎత్తి ఉంది. ఎత్తిన చేతిని ఆ నూతనవ్యక్తి పట్టుకొన్నాడు. ఆమె ఒక్క విదుపు విదిపింది. ఆవ్యక్తి దూరంగా తూలాడు. అదిచూచి ఒక తెలియరాని ఆనందం కీర్తిధరునిలో కలిగింది. అంతలో ఆ తూలిన వ్యక్తి వెనుకకు తిరిగి సైగచేశాడు. వెంటనే ఇంకా ఇద్దరు వ్యక్తులు ముందుకు వచ్చారు. ఈమాటు జాజియా అటూ ఇటూ పరుగులెత్తుతూంది. ఆమె ఆర్తనాదం చేస్తూ ఉన్నట్లు కీర్తిధరుని కనిపించింది. ఇక అక్కడ ఉండకుండ తక్షణం బయలుదేరాలని కీర్తిధరుడు లేవబోయాడు. ఇంతలో ఆ ముగ్గురు వ్యక్తులు తరిమి తరిమి ఆమెను పట్టుకొన్నారు. అది చూడగానే బయలుదేరడానికి కీర్తిధరునికి కాళ్లు రాలేదు. ఊరికే బిక్కమొగంతో చూస్తూనే ఉన్నాడు. ఆ నూతన వ్యక్తులు ఆమె చేతులు వెనుకకు విరిచి కట్టారు. మొదటివ్యక్తి తప్ప తక్కిన యిద్దరు తప్పుకొన్నారు. మొదటివ్యక్తి ఆమెను బలాత్కరిస్తూ ఉన్నాడు. ఆమె క్రింద పడిపోయింది. ఆమెపై అతడు పడుతూ ఉన్నాడు. ఆ భయంకర దృశ్యం కీర్తిధరుడు

(తరువాయి 59 వ పేజీలో)

# ఉత్తరాలు

( 2 వ పేజీ తరువాయి)

వారు పై రికార్డంతా సావధానంగా పరిశీలనచేసి డిజైను, ప్లాను, ఎస్టిమేట్లు తయారుచేసి మేజర్ కాటన్ దొరగారి ఎండార్సుమెంటు వ్రాయించి ఆ రిపోర్టును ప్రభుత్వానికి దాఖలు చేశారు. అప్పుడు కాటన్‌దొర ఇంజనీయర్లలో పెద్ద కావటంవల్ల, గోదావరి ఆనకట్ట కట్టి స్తుండడం వల్ల వారి అభిప్రాయంకూడా తీసు కున్నారు. అంతే వారి సంబంధం. తరువాత 5—1—1850 వ సంవత్సరంలో సర్ ఆర్. (ఆర్.ఇ) దొరగారిని కృష్ణ ఆనకట్ట పని చేయించ డానికి ప్రభుత్వం నియమించింది. ఆర్ దొరచేతి మీదుగా కృష్ణ ఆనకట్ట నిర్మాణం పనిపూర్తి అయింది. 9—8—1855 వ తేదీలో ఆనకట్ట నిర్మాణం పూర్తి చేయించారని, యీపని చేసింది సర్ ఆర్ (ఆర్.ఇ.) గారని కృష్ణాజిల్లా మ్యాన్యు యల్ నందు వివరంగా వ్రాయబడి ఉంది. అంతేగాని సర్ ఆర్థర్ కాటన్‌గారికి కృష్ణ ఆనకట్ట నిర్మాణంతో ఎట్టి సంబంధంలేదు. ఈ ఆనకట్ట నిర్మాణ కాలంలో కాటన్‌గారు గోదావరి ఆనకట్ట కట్టిస్తూ జబ్బుపడిపోయి ఓడలో మద్రాసువెళ్ళి ఆసుపత్రిలో చేరినట్లుగా కాటనుగారి జీవితమునందు పేర్కొనబడినది. కానీ ఈమధ్య ఏకారణం వల్లనో ఎవరి అవజ్ఞత వల్లనో ఆర్ దొర అడుగునబడి ఏమీ సంబంధం లేని కాటనుదొర ప్రచారంలోకి వచ్చాడు. ఈ వివ రాలు కావలసినవారు కృష్ణాజిల్లా మ్యాన్యుయల్ చూస్తే చరిత్ర అంతా అవగాహన కాగలదు.

—గూడూరి సమశ్శివాయ
(విజయవాడ)

## గర్వకారణం?

తమరు 16—10—63 వ తేది సంచికలో 'మన తెలుగు తల్లి' శీర్షికలో విజయవాడను గురించి ప్రచురించినది చదవడం తటస్థించింది. అందులో (22 వ పేజీలో) పర్వత వాతావరణం, ప్రకృతి రమణీయతలతోపాటు భిక్షుకుల ఆలా పనలు కూడ దేవాలయ వైభవానికి దోహదం చేస్తున్నట్లు వ్రాశారు.

స్వాతంత్ర్యం సిద్ధించిన తరువాత 16 ఏళ్ళ కాంగ్రెస్ పరిపాలనలో మనదేశపు భిక్షుక జనాభా నాలుగురెట్లు పెరిగినట్లు శాస్త్రజ్ఞుల అంచనా. భిక్షుకుల ఆలాపనలూ, ఆర్తనాదాలూ ఆక్రోశాలూ దేశవైభవానికి చిహ్నంగా పరిగ ణించవలసి వచ్చినందుకు ప్రతి భారతీయుడూ గర్వపడవలసిన అవసరం ఎంతైనా ఉందని నా అభి ప్రాయం.

—జి. రామకృష్ణ
(హైదరాబాద్ — 4)

* * *

16—10—63 వ తేది సంచికలో విజయ వాడ వ్యాసము చూచినాము. అందు బారేజికి ఎదురుగా అర్జున ప్రతిష్ఠితమైన 'విజయేశ్వర స్వామి' ప్రసక్తి లేదు. అర్జునుడు పాశుపతాస్త్ర లాభమునొంది విజయేశ్వరుని ప్రతిష్ఠించినాడు. ఆ ఆలయ మీమధ్య పునరుద్ధరింపబడి శ్రీ కంచి కామకోటి పీఠాధీశ్వరుల ఆశీర్వచనాను గ్రహ బలమున దినదినాభ్యుదయ స్థితి నొందు చున్నది. ఇది అతీత తపోయోగ్య ప్రదేశము. మందర ప్రశాంత దృశ్యములు ఒకసారి దర్శించిన వారు మరువజాలరు. ఈ విషయము వ్యాస కర్తలకు, పాఠకులకు జ్ఞప్తి చేయుటయే నా ఉద్దేశ్యము. విజయవాడకు వచ్చు యాత్రి కులు స్వామి దర్శనముచేసి అర్జునునివలె సకలార్థ లాభము నొందుదురుగాతయని మనవిచేయు చున్నాము.

—పండిత చిలుకూరి శ్రీరామ శాస్త్రి,
(విజయేశ్వర దేవస్థానం, ఇంద్ర
కీలాద్రి, విజయవాడ—1.)

### మీకు తెలుసా

## జవాబులు

1. 1927 లో, భారతదేశం నుంచి విభజించబడినప్పుడు.
2. 1932 లో, లాస్ ఏంజల్స్‌లో.
3. 'ట్రాన్స్‌ఫార్మర్'.
4. గోధుమ రంగు బొగ్గు.
5. (1) వై అంటే టపా రవాణాచేసేనౌకలు అని. (2) ఒ అంటే మనిషి సముద్రంలో పడిపోయాడని.
6. నాలుగు.
7. తుప్పుపట్టకుండా చూడ డానికి.
8. టానిక్ ఆమ్లము. ★

## బాల్య స్నేహితురాలు

ఆంధ్రదేశానికి ఎంతో దూరంలో ఉన్న మీ ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రికను చూడ గానే ఆంధ్రప్రదేశ్‌లోనే ఉన్నానా అనిపిస్తుంది. చక్కటి వ్యాసాలు, విమర్శలు, కథలు, చిత్రాలతో నిండి ఉండి, పోస్టుమన్ చేతినుంచి మాకురాగానే, ఆంధ్రనుండి మా బాల్యస్నేహితురాలు వచ్చిందా అనిపిస్తుంది. ప్రభ ఇంకను దినదినాభివృద్ధి నొందగలదని ఆశిస్తున్నాను.

—బంగారు ఇందిరాప్రసాద్
(తేజపూర్)

* * *

నేటి మన సంఘంలో ఉన్న కొన్ని లోట్లను ఏ ప్రజాసేవకులూ తీర్చలేక పోతున్నారు. అటు వంటి లోటు పాటులను ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక చక్కని సాంఘిక కథలద్వారా తీర్చి దిద్దుతున్నది. ఇందులో ప్రస్తుతం ప్రచు

# కొండ నీరైపోయింది

( 56 వ పేజీ తరువాయి)

చూడలేక కళ్ళు మూసుకొన్నాడు.

ఇంతలో "హా" అనే పెద్ద అరుపు కీర్తి ధరునికి వినవచ్చింది. ప్రమాదం వచ్చినప్పుడు జాజియా వేసే కేక అది. అతనికి ఆవేశం వచ్చి నిద్రనుంచి మేల్కొన్నట్లు లేచి వంపులదారి వెంట గబగబా బయలుదేరాడు. పాపం కీర్తి ధరుడు అంతదూరం నడిచి వచ్చేసరికి కొంత ఆలస్యమయింది. తన ఇంటిముందు జాజియా తప్ప మరెవ్వరూ లేరు. కాని జాజియా మరణా వస్థలో ఉంది. ఆమె కీర్తిధరుణ్ణిచూచి హోరు మని ఏడిచింది.

"స్వామీ! మైలపడ్డాను. నిజంగా మైల పడ్డాను. ఈ మైలదేహం తమకు అర్పించలేను. ఇదిగో కత్తి. ఇంట్లోనుంచి తెచ్చి నేనే నా గుండెల్లో నాటుకొన్నాను. మీలోని కొండదేవుని రూపం సాక్షిగా నాధర్మం నేను నిర్వర్తించాను, స్వామీ!" అని కన్నుమూసింది. కీర్తిధరుడు నివ్వెరపడి నిలువుగుండెతో చూస్తూ ఉన్నాడు. ఇంతలో యజ్ఞమణి అతనిముందు ప్రత్యక్ష మయింది.

"కీర్తిధరా! జాజియా ఇలాంటిదని నాకు తెలియదు. అయినా, నా ధర్మం నేను నిర్వర్తించు కొన్నాను. నిర్వర్తించుకొంటున్నానుకూడా" అని అంటూ తన ఉంగరంలోని వజ్రంపురవ్వ మ్రింగి తేలకళ్ళు వేసింది.

కీర్తిధరునికి నోట మాటలేదు. "జాజియా అంటే అంత ఆత్మవిశ్వాసంగల నేను ఈ అగ్ని పరీక్షకు ఒప్పుకొని ఇంత ఆత్మవంచన చేసు కొన్నాను. నారూపం కొండదేవుని ఆత్మకు కళంకప్రాయం" అని అనుకొంటూ స్తంభించి పోయాడు. ఆ భయంకర దృశ్యంచూచి అతని కనులవెంట కురిసే అశ్రువృష్టికి కొండదేవుని ఆత్మరూపంలోఉన్న అతనిపాదాల క్రింది కొండ నీరైపోయింది. ఆ నీటిలోబడి ఈదుకొంటూ అతడెక్కడికో వెళ్లిపోయాడు. ★